క్లుప్తంగా

ప్రతిభకు ప్రోత్సాహం



వర్షిణికి నగదు పురస్కారం అందజేస్తున్న వెన్నపూస నరేంద్రారెడ్డి

ఉయ్యాలవాడ : మాయలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 2023–24 విద్యా సంవత్సరంలో 10వ తరగతి పబ్లిక్ పరీక్షల్లో 528 మార్కులు సాధించిన ఇండ్ల వర్షిణికి గ్రామానికి చెందిన వెన్నపూస నరేంద్రారెడ్డి రూ. 10 వేలు బహుమతిగా అందజేశారు. ఆదివారం పాఠశాల ఆవరణలో జరిగిన అభినందన కార్యక్రమంలో నగదును అందజేశారు. ఈ సందర్భంగా హెచ్ఎం ఎస్ఎం షరీఫ్, ఉపాధ్యాయ బృందం దాతకుకృతజ్ఞతలు తెలిపారు.

హంతకులను కఠినంగా శిక్షించాలి



విధులు బహిష్కరించి నిరసన తెలుపుతున్న ప్రైవేటు వైద్యులు

ఆళ్లగడ్డ : కోల్‌కతాలో వైద్యురాలిపై లైంగిక దాడికి పాల్పడ్డ హంతకులను కఠినంగా శిక్షించాలని ఆళ్లగడ్డ ప్రైవేటు వైద్యులు డిమాండ్ చేశారు. ట్రైనీ డాక్టర్‌పై జరిగిన హత్యాచార ఘటనకు నిరసనగా ఆదివారం ఆళ్లగడ్డ ప్రైవేటు డాక్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విధులు బహిష్కరించి నల్లరిబ్బన్లు పెట్టుకుని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక కార్యాలయంలో మృతురాలికి నివాళులర్పించారు. దోషులను వెంటనే అరెస్ట్ చేసి ఉరిశిక్ష అమలు చేయాలన్నారు.

బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించాలి



ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

నంద్యాల(అర్బన్): బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఐసీడీఎస్ నోడల్ ఆఫీసర్ లీలావతి, రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ మాజీ సభ్యులు రాజేశ్వరమ్మ అన్నారు. ఆదివారం పట్టణంలోని నందమూరినగర్ హెల్త్ ఎడ్యుకేషనల్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో చైల్డ్ మ్యారేజ్ ఫ్రీ ఇండియాపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న లీలావతి మాట్లాడుతూ పిల్లల ఉజ్వల భవిష్యత్‌కు పాటుపడాలన్నారు. అధ్యక్షుడు కృష్ణయ్యయాదవ్, స్టార్ సొసైటీ కార్యదర్శి సుబ్బరాయుడు, మహంకాళి, సంపత్, ఉపాధ్యాయులు, విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు.

మహానందీశుడి సేవలో..



అధికారులకు వేద ఆశీర్వచనాలు

నంద్యాల(అర్బన్): మహానందిలోని మహానందీశ్వరస్వామి, కామేశ్వరి అమ్మవారిని జిల్లా స్టేట్ బ్యాంక్ హెచ్ఆర్ కేశవగౌడ్, ఏపీ అమరావతి సీడీఓ రాహుల్ సంక్రీతీయ ఆదివారం వారి బృందంతో దర్శించుకున్నారు. దేవస్థానం సహాయ కార్యనిర్వహణ అధికారి మధు ఆలయ మర్యాదలతో వారికి స్వాగతం పలికారు. అనంతరం స్వామి, అమ్మవారికి అభిషేకాలు, అర్చనలు నిర్వహించి వేదపండితుల ఆశీర్వచనాలు, తీర్థప్రసాదాలను అందజేశారు.

కాశీ అన్నపూర్ణ సత్రం అధ్యక్షుడిగా భవనాశి వాసు



నంద్యాల(వ్యవసాయం): పట్టణానికి చెందిన ప్రముఖ వ్యాపారి భవనాశి వాసు శ్రీకాశీ అన్నపూర్ణ వాసవీ ఆర్యవైశ్య నిత్యాన్న సత్రం సంస్థల అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వారణాశి, తిరుపతి, షిర్డీ, హరిద్వార్, హైదరాబాద్ దేవాలయ పరిసరాల్లోని ఆర్యవైశ్య నిత్యాన్న సత్రాలు, వృద్ధాశ్రమాలకు అన్నింటికి ఏకగ్రీవంగా అధ్యక్షుడిగా ఎన్నుకున్నట్లు వారు తెలిపారు. అదే విధంగా ప్రధాన కార్యదర్శిగా బీఎస్ విలాస్, కోశాధికారిగా నందకుమార్, దత్తాత్రేయలను ఎన్నుకోవడం జరిగిందన్నారు. తనపై నమ్మకం ఉంచి ఈ పదవికి ఏకగ్రీవంగా ఎన్నికకు సహకరించిన మాజీ రాజ్యసభ సభ్యుడు టీజీ వెంకటేష్, ఆర్యవైశ్య సంఘం నాయకులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

నృత్య నీరాజనం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న నిత్య కళారాధన కార్యక్రమంలో భాగంగా ఆదివారం నిత్యకళావేదికపై మహబూబ్‌నగర్‌కు చెందిన బిందుమాధవి బృందం సంప్రదాయ నృత్యాన్ని ప్రదర్శించారు. అలాగే కర్నూలుకు చెందిన బి.నాగమల్లేశ్వరి, బృందం వారిచే సంప్రదాయ నృత్య ప్రదర్శన చేశారు.

నీటి విడుదల ఎన్నడో?

- గోస్పాడు ఎస్ఎస్ ట్యాంక్ నుంచి నీటిని సరఫరా చేయని వైనం
- ఎస్ఎస్ ట్యాంక్‌లో పుష్కలంగా నీరు
- చిన్నపాటి మరమ్మతులను చేయించలేని యంత్రాంగం
- ప్రజలకు తప్పని ఇబ్బందులు
- పట్టించుకోని అధికారులు

గోస్పాడు: మండల కేంద్రమైన గోస్పాడు నుంచి యాళ్లూరుకు వెళ్లే రహదారి పక్కనే ఎస్ఎస్ ట్యాంక్ నిర్మించారు. ప్రజలకు నీటి కష్టాలు తీర్చేందుకు గతంలో ఎస్ఎస్ ట్యాంక్ ఏర్పాటు చేశారు. ఈ ట్యాంకు నిర్వహణ ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ ఆధ్వర్యంలో కొనసాగుతుంది. ఎస్ఎస్ ట్యాంకులో నీరున్నా చిన్నపాటి మరమ్మతులు తలెత్తడంతో అధికారులు పరిష్కరించక సమస్య తలెత్తింది. దీంతో ప్రజలకు నీటి ఇక్కట్లు తప్పడం లేదు. నీటి సమస్యపై ఇప్పటికే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇక్కడి నుంచి గోస్పాడు, పసురుపాడు, జులేపల్లె గ్రామాలకు నీటిని సరఫరా చేస్తుంటారు. కేసీ కెనాల్ నీటిని పైపులైన్ ద్వారా ఎస్ఎస్ ట్యాంకును నింపుతారు. అనంతరం ఇక్కడి నుంచి నీటిని ఆయా గ్రామాలకు సరఫరా చేయాల్సి ఉంది. గత 20 రోజులుగా ట్యాంక్ ద్వారా వచ్చే నీరు గ్రామాలకు సరఫరా లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. బోర్ల నుంచి ఓవర్ హెడ్ ట్యాంకులకు వచ్చే నీరు ఉప్పగా ఉండడంతో పూర్తి స్థాయిలో ఉపయోగించుకునేందుకు వీలుకాని పరిస్థితి నెలకొంది. ఎండాకాలం నీరులేని సమయాల్లో పరిస్థితి ఒకలా ఉంటే వర్షాలు కురిసి కాలువల ద్వారా నీరు సమృద్ధిగా అందుతున్నా అధికారుల నిర్లక్ష్యం కారణంగా ప్రజలకు నీటిని సరఫరా చేయడం లేదు. ఎస్ఎస్ ట్యాంకు నుంచి నీరు అందకపోవడంతో పాటు స్థానిక ట్యాంకుల నుంచి వచ్చే బోరు నీరు



గోస్పాడులోని ఎస్ఎస్ ట్యాంకు

ఎగువ ప్రాంతాలకు పూర్తిస్థాయిలో అందటంలేదు. దీంతో గోస్పాడులోని గంగమ్మపేట, కొత్తకాలనీలో నీటి ఎద్దడి తీవ్రంగా ఉంది. పొలాలకు వెళ్లే సీజన్ కావడంతో రైతులు, కూలీలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయంపై ఆదివారం గోస్పాడు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ నవీనను సాక్షి ఫోన్‌ద్వారా వివరణ కోరడానికి ప్రయత్నించగా అందుబాటులోకి రాలేదు.

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

ఉయ్యాలవాడ : స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ శ్రీనివాసులు ఆదివారం తెలిపారు. సమస్యలపై మండల ప్రజలు వినతులు అందజేయవచ్చని వెల్లడించారు. రెవెన్యూ కార్యాలయంలో జరిగే ఈ ప్రజా వేదికకు అన్ని శాఖల అధికారులు హాజరు కావాలని సూచించారు.

25న దళిత సమాఖ్య ఆవిర్భావ సభ

నంద్యాల(అర్బన్): ఈనెల 25వ తేదీన ఏపీ దళిత సమాఖ్య 22వ ఆవిర్భావ వార్షికోత్సవ సభను నిర్వహిస్తున్నట్లు దళిత సమాఖ్య జిల్లా అధ్యక్షుడు కృష్ణ, ఉపాధ్యక్షుడు గుర్రప్ప ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. అనంతపురం జిల్లా కేంద్రంలోని సప్తగిరి సర్కిల్‌లోనున్న లలిత కళాపరిషత్‌లో నిర్వహించే సభకు దళిత సమాఖ్య వ్యవస్థాపక అధ్యక్షులు కొమ్ముపాలెం శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి ఎల్లయ్య, దళిత బహుజన సాహిత్య వేత్త లక్ష్మీనరసయ్యలు ముఖ్యఅతిథులుగా హాజరవుతారని పేర్కొన్నారు. జిల్లాలోని దళిత సమాఖ్య నాయకులు, సభ్యులు తరలి రావాలని పిలుపునిచ్చారు.

ఫుట్‌బాల్ క్రీడను బలోపేతం చేస్తాం



బహుమతులు అందుకుంటున్న క్రీడాకారులు

నంద్యాల(న్యూటౌన్): ఫుట్‌బాల్ క్రీడను బలోపేతం చేయడమే లక్ష్యంగా తమ ఫౌండేషన్ ముందుకు వెళ్తుందని మహికిశోర్ ఫౌండేషన్ చైర్మన్ మహేశ్వరమ్మ, శాంతినికేతన్ పాఠశాల కరస్పాండెంట్ సుధాకర్ అన్నారు. ఆదివారం పట్టణంలోని ఎస్పీజీ క్రీడా మైదానంలో ఫుట్‌బాల్ పోటీలను నిర్వహించారు. ఫుట్‌బాల్ పోటీల్లో 16 జట్లు పాల్గొన్నాయి. ఐజ్‌బర్గ్ ఎఫ్‌సీ సీనియర్స్ విజేతగా నిలువగా రూ.10వేలు ట్రోఫీ, రెండు బహుమతి డీగో మ్యారడోన సెవెన్స్ నంద్యాల జిల్లాకు చెందిన జట్టు సాధించగా రూ.5వేలు, ట్రోఫీ అందజేశారు. అలాగే జూనియర్స్ విభాగంలో మొదటి బహుమతి నందికొట్కూరు విజేతగా నిలిచింది. రెండో బహుమతి నంద్యాల జట్టు దక్కించుకుంది. వైష్ణవి కిశోర్, అఖిల్, చంద్రావతి, ఆర్గనైజర్లు సిద్ధార్థ చైతన్య పాల్గొన్నారు.

విజయమే లక్ష్యంగా పోరాడాలి



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న రవికృష్ణ

నంద్యాల(న్యూటౌన్): రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో నంద్యాల క్రీడాకారులు విజయమే లక్ష్యంగా పోరాడాలని నంద్యాల ఫుట్‌బాల్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు డాక్టర్ రవికృష్ణ అన్నారు. ఆదివారం పట్టణంలోని ఎస్పీజీ క్రీడా మైదానంలో అండర్–13 జిల్లా స్థాయి ఫుట్‌బాల్ ఎంపిక పోటీలు నిర్వహించారు. పోటీలకు జిల్లాలోని ఆళ్లగడ్డ, ఆత్మకూరు, నందికొట్కూరు, పాణ్యం తదితర ప్రాంతాల నుంచి 95 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఈనెల 23 నుంచి 25వ తేదీ వరకు విజయవాడలో జరిగే రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో ఎంపికైన క్రీడాకారులు పాల్గొంటారన్నారు. అసోసియేషన్ సభ్యులు వినయ్‌సాగర్, సెక్రటరీ అనిల్‌బాబు, జాయింట్ సెక్రటరీ రాజా చక్రవర్తి పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలి



మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

నంద్యాల(న్యూటౌన్): ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కూటమి ప్రభుత్వం తక్షణమే చర్యలు చేపట్టాలని యూటీఎఫ్ రాష్ట్ర కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు వెంకటేశ్వర్లు, ప్రసాద్ కోరారు. ఆదివారం యూటీఎఫ్ స్వర్ణోత్సవాల్లో భాగంగా పట్టణంలోని నేషనల్ పీజీ కళాశాలలో రాష్ట్ర సహాయ అధ్యక్షుడు సురేష్‌కుమార్ అధ్యక్షతన సాంస్కృతిక రంగం..ఉపాధ్యాయుల పాత్ర అనే అంశంపై సెమినార్ నిర్వహించారు. వారు మాట్లాడుతూ కొన్ని జీవోలను రద్దు చేసి విద్యారంగాన్ని కాపాడాలన్నారు. 1– 5 తరగతులు ప్రాథమిక పాఠశాలలుగా ఉంచాలని డిమాండ్ చేశారు. మోడల్ స్కూల్, ఎయిడెడ్ ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో రవికుమార్, ఎంవీ సుబ్బారెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నాగమణి, శాంతిప్రియ, నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి మాణిక్యంశెట్టి, సుధీర్‌బాబు, సోమయ్య పాల్గొన్నారు.

విద్యార్థులకు భగవద్గీత పఠన పోటీలు

నంద్యాల(వ్యవసాయం): శ్రీకృష్ణ భగవాన్ సేవా సమితి ఆధ్వర్యంలో శ్రీకృష్ణ జయంతిని పురస్కరించుకొని ఆదివారం పద్మావతినగర్‌లోని శ్రీకృష్ణ మందిరంలో విద్యార్థులకు భగవద్గీత పఠన పోటీలు నిర్వహించారు. భగవద్గీతలోని 12, 15, 16 అధ్యాయాల పఠనంపై పోటీలు జరిపించారు. న్యాయ నిర్ణేతలుగా భాస్కరరెడ్డి, వెంకటేశ్వర్లు, వెంకటరమణయ్య, ఉమామహేశ్వరి వ్యవహరించారు. ప్రథమ బహుమతి సురక్ష, ద్వితీయ వైష్ణవి, తృతీయ సుస్మిత సాధించారు. అలాగే సాయంత్రం సర్వమానవాళి అభివృద్ధికి సమస్యల నివారణకు భగవద్గీత సూచిక అనే అంశంపై వ్యాసరచన పోటీలు ఏర్పాటు చేశారు. ప్రతిభ చూపిన వారికి శ్రీకృష్ణ జయంతి రోజున బహుమతులు అందజేస్తామని అధ్యక్షుడు పార్థసారథి కృష్ణ తెలిపారు.



ప్రతిభ చూపిన విద్యార్థులతో సేవా సమితి సభ్యులు

కట్టించారు.. వదిలేశారు!

ఉయ్యాలవాడ : మండల కేంద్రమైన ఉయ్యాలవాడలో లక్షలాది రూపాయలు ఖర్చు చేసి నిర్మించిన ఎస్సీ కమ్యూనిటీ హాలు నిరుపయోగంగా మారింది. ఎస్సీ కుటుంబాలకు చెందిన వారు ఏదైనా శుభ కార్యాలు జరుపుకోవాలన్నా గృహాల వద్ద ఇబ్బందులు పడకుండా ఉండేందుకు వారి వసతుల కోసం అప్పట్లో భవనం నిర్మించారు. సుమారు 10 సెంట్ల విస్తీర్ణంలో ఎస్సీ సబ్ ప్లాన్ కింద రూ. 7.50 లక్షలతో భవన నిర్మాణాన్ని పూర్తి చేశారు. సంవత్సరాలు గడుస్తున్నా భవనం ప్రారంభించక పోవడం, అధికారులు పట్టించుకోకపోవడంతో కాలనీ వాసులకు ప్రయోజనం లేకుండా పోయింది. ఇప్పటికైనా మళ్లీ అధికారంలోకి వచ్చిన టీడీపీ ప్రభుత్వం స్పందించి కాలనీలో నిరుపయోగంగా వున్న భవనాన్ని వాడుకలోకి తీసుకురావాలని కాలనీ వాసులు కోరుతున్నారు.



ఉయ్యాలవాడలో నిరుపయోగంగా మారిన ఎస్సీ కమ్యూనిటీ హాల్

తెలుగుగంగ కాల్వ కట్ట కోత



అప్పనపల్లె వద్ద కోతకు గురైన కాల్వ కట్ట

రుద్రవరం: మండల పరిధిలోని అప్పనపల్లె వద్ద 19వ బ్లాక్ తెలుగుగంగ ఉప ప్రధాన కాల్వ కోతకు గురై ప్రమాదకరంగా మారింది. వాహనదారులు, ఎడ్ల బండ్లు ఏమరుపాటున ఉంటే ప్రమాదం బారిన పడాల్సి వస్తుంది. తెలుగుగంగ కాల్వకు నీరు విడుదల చేయడంతో కాల్వల్లో నీటి ప్రవాహ ఉధృతి పెరిగింది. ఆ ఉధృతికి తాళలేక కాల్వ కట్ట కోతకు గురైంది. అప్పనపల్లె, గోనంపల్లె, వెలగలపల్లె, కొండమాయపల్లె తదితర గ్రామాలకు చెందిన రైతుల పొలాలు అటువైపే ఉన్నాయి. వ్యవసాయ పనుల నిమిత్తం నిత్యం వందలాది మంది రైతులు అటువైపు వెళ్తుంటారు. రైతులు ప్రమాదాల బారిన పడకముందే అధికారులు స్పందించి కోతకు గురైన ప్రదేశంలో మరమ్మతు పనులు చేపట్టాలని ఆయా గ్రామాల రైతులు కోరారు.

ముస్లిం సమాజానికి బాసటగా జేఏసీ

నంద్యాల(అర్బన్): నంద్యాల ముస్లిం జాయింట్ యాక్షన్ కమిటీ ముస్లిం సమాజానికి బాసటగా ఉంటుందని జేఏసీ నూతన కన్వీనర్ గన్నీ అబ్దుల్‌కరీం పేర్కొన్నారు. పట్టణంలోని ఫరూక్ నగర్‌లోనున్న ఉస్మానియా పాఠశాలలో ఆదివారం ముస్లిం జేఏసీ నంద్యాల నియోజకవర్గ స్థాయి ఎన్నికలు నిర్వహించారు. ఆర్వోగా ఉపాధ్యాయుడు షేక్షావలి వ్యవహరించగా.. ఓటింగ్‌లో దాదాపు 90శాతం ముస్లిం సంఘాలు పాల్గొన్నారు. జేఏసీ కన్వీనర్‌గా గన్ని అబ్దుల్‌కరీం, కో కన్వీనర్‌గా షేక్ మహబూబ్‌బాషా, కోశాధికారిగా రసూల్‌తో పాటు 10 మంది కార్యవర్గ సభ్యులు ఎన్నికయ్యారు. మాజీ కౌన్సిలర్ గౌస్, జమాన్ సర్, సయ్యద్ ఇక్బాల్‌బాషా, గోరేచాంద్‌లను సలహాదారులుగా నియమితులయ్యారన్నారు.

ఫుడ్ కోర్టు వేలం

నంద్యాల(అర్బన్): జిల్లాలోని కొత్తపల్లి మండలం సంగమేశ్వరంలోనున్న ఫుడ్ కోర్టు, పగిడ్యాల మండలం ముచ్చుమర్రిలో నిర్మాణంలోనున్న కట్టడాన్ని జిల్లా పర్యాటక శాఖ వేలం నిర్వహించనున్నట్లు జిల్లా పర్యాటక అధికారి సత్యనారాయణ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ముచ్చుమర్రిలోని కట్టడాన్ని ఈ నెల 22వ తేదీన, సంగమేశ్వరంలోని ఫుడ్ కోర్ట్‌ను ఈనెల 23వ తేదీన కలెక్టరేట్‌లోని పర్యాటక శాఖ కార్యాలయంలో వేలం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల వారు రూ.5వేలు దరావత్తును జిల్లా కలెక్టర్, చైర్మన్, జిల్లా పర్యాటక మండలి పేరు మీద చెల్లించి వేలంలో పాల్గొనాలని సూచించారు. వివరాలకు సెల్ 7995087089, 8297098022 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

డ్రైవర్ల సమస్యల పరిష్కారానికి కృషి

నంద్యాల(అర్బన్): ఏపీ ప్రభుత్వ వాహన డ్రైవర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని డ్రైవర్ల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు అబ్దుల్‌ఖాదర్ అన్నారు. స్థానిక కార్యాలయంలో జిల్లా స్థాయి జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ డ్రైవర్ల సమస్యలను తమ దృష్టికి తెస్తే కలిసి కట్టుగా సమస్యలను పరిష్కరించుకుందామన్నారు. ఉపాధ్యక్షుడు శీను, కార్యదర్శి పోలిరెడ్డి, రాజారావు, కృపాకర్, మోహన్‌రావు, సామేలు, రంగనాయకులు, తిరుమల్, త్రినాథ్, సుబ్బారెడ్డి, మద్దిలేటి, శివరామకృష్ణ పాల్గొన్నారు.

నేడు డోన్‌కు సీపీఐ రామకృష్ణ రాక

నంద్యాల(న్యూటౌన్): డోన్ పట్టణంలో సోమవారం నిర్వహించే నంద్యాల జిల్లా సీపీఐ జనరల్ బాడీ సమావేశానికి సీపీఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే రామకృష్ణ ముఖ్యఅతిథిగా హాజరవుతున్నట్లు సీపీఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు, సహాయ కార్యదర్శి బాబాఫక్రుద్దీన్ ఆదివారం తెలిపారు. వారు మాట్లాడుతూ జిల్లాలోని సీపీఐ నాయకులు, కార్యకర్తలు, కమిటీ సభ్యులు, ప్రజా సంఘాల నాయకులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో జిల్లాలో చేపట్టాల్సిన ఉద్యమాలపై భవిష్యత్ ప్రణాళికను రూపొందిస్తారని చెప్పారు.

సాగునీటి ప్రాజెక్టులపై దృష్టి సారించాలి

నంద్యాల(అర్బన్): సంపద సృష్టించే సాగునీటి ప్రాజెక్టుల నిర్వహణపై ప్రభుత్వం దృష్టి సారించాలని రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షుడు బొజ్జా దశరథరామిరెడ్డి తెలిపారు. ఆదివారం స్థానిక కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ తుంగభద్ర డ్యాంకు స్టాప్‌లాగ్ గేట్లను అమర్చడంలో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ ప్రత్యేక అభినందనలు తెలుపుతున్నామన్నారు. తుంగభద్ర డ్యాం గేట్ల జీవిత కాలం 45 ఏళ్లు కాగా డ్యాం నిర్మాణం జరిగి 70 సంవత్సరాలు పూర్తయి మార్చకపోవడం వల్లే ఉపద్రవం సంభవించిందన్నారు. సంపద సృష్టించే సాగునీటి ప్రాజెక్టుల నిర్వహణకు నిధులు మళ్లించి సాగునీటి రంగాన్ని ప్రోత్సహించాలని కోరారు.

వినాయక చవితి ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకుందాం

నంద్యాల(వ్యవసాయం): వినాయక చవితి ఉత్సవాలను ఉత్సవ నిర్వాహకులు, అధికారుల పరస్పర సమన్వయంతో ప్రశాంతంగా జరుపుకుందామని ఉత్సవ సమితి జిల్లా గౌరవాధ్యక్షుడు డాక్టర్ రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం నంద్యాల జిల్లా గణేష్ మహోత్సవ కేంద్ర సమితి ఆధ్వర్యంలో మండల కమిటీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ ఏడాది కూడా వినాయక విగ్రహాల ప్రతిష్ఠ, నిమజ్జన కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని సూచించారు. ఇటీవల కలెక్టర్, ఎస్పీలను కలిసి వినాయక ఉత్సవాలు, నిమజ్జనం గురించి వివరించగా, త్వరలో అధికారులు సమావేశం నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో గణేష్ మహోత్సవ సమితి సభ్యులు సందీప్, రామాంజనేయులు, నీలకంఠం, చంద్రశేఖర్, అభిరుచి మధు, రాంప్రసాద్, నాగదీప్, విష్ణువర్ధన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

తప్పిపోయిన బాలుడి అప్పగింత

బొమ్మలసత్రం: నంద్యాల ఆర్టీసీ బస్టాండ్‌లో తప్పిపోయిన బాలుడిని కమాండ్ కంట్రోల్ పోలీసులు కేవలం రెండు గంటల్లో వెతికి అప్పగించిన సంఘటన ఆదివారం సాయంత్రం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. జలకనూరు గ్రామానికి చెందిన హేమంత్ నంద్యాల ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో చదువుతున్నాడు. ఆదివారం కావటంతో తన మేనమామ శ్రీనుతో కలిసి బయటికి వెళ్లాడు. ఆర్టీసీ బస్టాండ్ వద్దకు రాగానే బాలుడు బహిర్భూమికని వెళ్లి తిరిగి రాలేదు. బాలుడి మేనమామ ఉన్న స్థలాన్ని గుర్తించలేక బస్టాండ్ చుట్టు పక్కల వెతకసాగాడు. అక్కడే ఉన్న కానిస్టేబుల్‌కు శ్రీను జరిగిన విషయం చెప్పడంతో కమాండ్ కంట్రోల్ సిబ్బందిని అప్రమత్తం చేశారు. బస్టాండ్ సమీపంలో తిరుగుతున్న బాలుడిని గుర్తించారు. రెండు గంటల్లో తనకు అప్పగించినందుకు శ్రీను కృతజ్ఞతలు తెలిపాడు.



బాలుడిని మేనమామకు అప్పగించిన పోలీసులు

మనిషిలో దైవత్వంతో సమసమాజ స్థాపన



స్వామి వారికి తీర్థప్రసాదాలు అందజేసిన అర్చకులు

నంద్యాల(అర్బన్): ప్రతి మనిషిలో దైవత్వాన్ని చూసిన నాడే సమసమాజ స్థాపన సాధ్యమవుతుందని కాకనూరు శ్రీ శారదా పీఠం పీఠాధిపతి శ్రీశివయోగేంద్ర సరస్వతి స్వామి పేర్కొన్నారు. ఆదివారం మహానందీశ్వరస్వామి దర్శనార్థం వచ్చిన స్వామి వారికి ఆలయ అధికారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. శ్రీకామేశ్వరిదేవి సమేత శ్రీ మహానందీశ్వరస్వామి వారికి పీఠాధిపతులు అభిషేకం, కుంకుమార్చన పూజలు నిర్వహించారు. దర్శనం, పూజలు అనంతరం ఆయనకు ఆలయ అధికారులు ఆశీర్వచన మండపంలో తీర్థప్రసాదాలు అందజేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు హిందూ ధర్మంపై జరుగుతున్న దాడులను అరికట్టే చర్యలు తీసుకోవాలని కోరారు.

నిందితులను శిక్షించాలి

నంద్యాల(న్యూటౌన్): కోల్‌కతాలో వైద్య విద్యార్థిని అత్యాచారం, హత్యకు పాల్పడిన నిందితులను అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని ఏపీటీఎఫ్ నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి నగరి శ్రీనివాసులు, రాష్ట్ర కమిటీ సభ్యులు సాంబశివుడు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ సభ్యసమాజం తలదించుకునేలా విధుల్లో ఉన్న మహిళా వైద్యురాలిపై అత్యాచారం చేసి హత్యకు పాల్పడటం దుర్మార్గమన్నారు. భవిష్యత్‌లో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. జూనియర్ డాక్టర్లు చేస్తున్న సమ్మెకు ఏపీటీఎఫ్ మద్దతు తెలిపిందన్నారు. సమావేశంలో పుల్లయ్య, రవి, పవన్‌కుమార్, జయరాం, మునిస్వామి, నగరి వెంకటేశ్వర్లు, రమణయ్యయాదవ్, గోపాల్‌రావు, నరసింహులు, ప్రతాపరెడ్డి, గురువయ్య, రమేష్, వెంకటరామిరెడ్డి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాసులు

నంద్యాల(అర్బన్): కోల్‌కతాలోని ఆర్‌జీ కార్ వైద్యశాలలో ట్రైనీ డాక్టర్ అత్యాచారం, హత్య నిందితులను కఠినంగా శిక్షించాలని ఏపీ వడ్డెర సంఘం రాష్ట్ర కార్యదర్శి చల్లా వెంకటేష్ ఆదివారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి మహిళలపై ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. బాధితురాలి కుటుంబానికి రక్షణ కల్పిస్తూ ఆర్థిక భరోసాను ఇవ్వాలన్నారు.

వీబీఆర్‌కు కొనసాగుతున్న నీటి విడుదల

వెలుగోడు: తెలుగు గంగ ప్రాజెక్టులో అంతర్భాగమైన వెలుగోడు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌కు నీటి విడుదల కొనసాగుతోంది. వీబీఆర్ సామర్థ్యం 16.95 టీఎంసీల గాను ఆదివారం సాయంత్రానికి 14.287 టీఎంసీలకు చేరింది. బానకచర్ల క్రాస్ రెగ్యులేటర్ నుంచి లింకు చానల్ మీదుగా వీబీఆర్‌లోకి 10100 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. దీంతో వీబీఆర్ నుంచి మద్రాస్ కాలువకు 5000 క్యూసెక్కులు, స్పిల్‌వే ద్వారా 5 వేల క్యూసెక్కులు, వన్ ఆర్ తూముకు 50 క్యూసెక్కులు, వన్ ఎల్ తూముకు 30 క్యూసెక్కుల నీటిని దిగువకు పంపుతున్నట్లు తెలుగు గంగ ఏఈ శివ నాయక్ తెలిపారు.



నిండుకుండలా వెలుగోడు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్

తెలుగు గంగ జలాశయాన్ని వీక్షించేందుకు వివిధ ప్రాంతాల నుంచి తరలివస్తున్న సందర్శకులతో రిజర్వాయర్ వద్ద సందడి నెలకొంది.

వేడుకగా పల్లకీ సేవ

శ్రీశైలంటెంపుల్: శ్రీభ్రమరాంబ మల్లికార్జున స్వామివారి ఉత్సవమూర్తులకు ఆదివారం పల్లకీ సేవ నిర్వహించారు. ముందుగా ప్రత్యేకంగా అలంకరించిన పల్లకీలో స్వామిఅమ్మవార్లను ఆశీనులను చేశారు. వేదమంత్రోచ్ఛారణల నడుమ ప్రత్యేక పూజలు చేసి, మేళతాళాలతో ఆలయ ప్రదక్షిణ చేశారు. పూజా కార్యక్రమాల్లో దేవస్థాన అధికారులు, అర్చకులు పాల్గొన్నారు.



ప్రత్యేక అలంకరణలో స్వామిఅమ్మవారు

శ్రీశైలంలో ముగిసిన ద్విశతావధానం

శ్రీశైలంటెంపుల్: శ్రావణమాసోత్సవాలను పురస్కరించుకుని శ్రీశైల దేవస్థానం పశ్చిమగోదావరి జిల్లా భీమడోలుకు చెందిన డాక్టర్ బులుసు అపర్ణ వారిచే నిర్వహించిన ద్విశతావధానం ఆదివారం ముగిసింది. అవధాన కవితా నీరాజనం పేరుతో ఈ నెల 14వ తేదీ నుంచి ఆలయ దక్షిణ మాఢవీధిలోని నిత్యకళారాధన వేదికపై ఐదు రోజుల పాటు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన 60 మందికి పైగా కవి పండితులు పృచ్ఛకులుగా పాల్గొన్నారు. మొదటిరోజు ప్రారంభసభకు డోన్ చెందిన కళారత్న గండ్లూరి దత్తాత్రేయ శర్మ విశిష్ట అతిథిగా పాల్గొన్నారు. ముగింపు సమావేశానికి తిరుపతి జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం వైస్‌చాన్స్‌లర్ జి.ఎస్.ఆర్.కృష్ణమూర్తి హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి విశాఖపట్నంకు చెందిన ప్రముఖ సాహితీ వేత్త డాక్టర్ పేరి రవికుమార్ సంధానకర్తగా వ్యవహరించారు. ఐదు రోజుల పాటు జరిగిన కార్యక్రమంలో బులుసు అపర్ణ 50 సమస్యలు, 50 దత్తపదులు, 50 వర్ణాంశాలు, 30 ఆశువులు, 20 ఘంటావధానాలను పూరించారు. కార్యక్రమం ముగింపులో అవధానానికి, విశిష్ట అతిథులకు, పృచ్ఛకులుగా వ్యవహరించిన కవిపండితులందరికి వేదాశీర్వచనముతో శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో దేవస్థాన డిప్యూటీ కార్యనిర్వహణాధికారి ఆర్.రమణమ్మ, పీఆర్వో టీ.శ్రీనివాసరావు, పర్యవేక్షకురాలు గిరిజామణి తదితర సిబ్బంది పాల్గొన్నారు.



ద్విశతావధానం కార్యక్రమంలో ప్రసంగిస్తున్న డాక్టర్ బులుసు అపర్ణ